క్లుప్తంగా

ముక్కంటి సేవలో హెచ్‌పీ సీఎం



ఆలయంలో జైరాంసింగ్ ఠాగూర్

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని మంగళవారం హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి జైరాంసింగ్ ఠాగూర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ వేదపండితులు, బీజేపీ నాయకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఠాగూర్ రూ.5వేలు రాహుకేతు పూజలను చేయించుకున్నారు. శ్రీస్వామి,అమ్మవార్ల దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు. బీజేపీ నాయకులు గరికపాటి రమేష్, వాసు, ఢిల్లీ, అమర్‌నాథ్, ఉమాసింగ్, కన్నా వెంకటేశ్వర్లు, చందు, సుధీర్, రాజా తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ దివాకర్‌బాబు

బుచ్చినాయుడుకండ్రిగ: వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని మండల వైద్యాధికారి దివాకర్‌బాబు తెలిపారు. మంగళవారం లక్ష్మీపురం గిరిజన కాలనీలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 45 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలని, కాచి వడపోసిన నీటిని తాగాలని, మురుగునీటి నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కుష్టు నివారణ అందరి బాధ్యత



ర్యాలీలో వైద్య సిబ్బంది, విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: కుష్టు వ్యాధి నివారణ సమష్టి బాధ్యతని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని కంచనపుత్తూరులో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నివారణపై ర్యాలీ నిర్వహించారు. ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, సర్పంచ్ స్వప్న, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. వైద్యాధికారి, సర్పంచ్ మాట్లాడుతూ ఎలాంటి అనుమానిత లక్షణాలు ఉన్నా ఇంటి వద్దకు వచ్చే ఆశా కార్యకర్తలకు తెలిపితే, పీహెచ్‌సీలో పరీక్షలు చేయించి మందులు ఇప్పిస్తారని తెలిపారు.


తాగునీటి సమస్య పరిష్కారం



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పీవీ కండ్రిగ గ్రామంలో తాగునీటి బోరు మోటారుకు మంగళవారం సర్పంచ్ కోటమ్మ మరమ్మతులు చేయించారు. పంచాయతీలో నిధులు లేకపోయినా సొంతంగా బోరు మోటారు మరమ్మతులు చేయించారు. తాగునీటి సమస్య తీరడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

నైపుణ్యాల శిక్షణకు ఎంపిక



పాల్గొన్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో మంగళవారం జేకేసీ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధిపై అవగాహన, ఎంపిక కార్యక్రమం జరిగింది. బెంగళూరుకు చెందిన జీటీడీ ఫౌండేషన్ అధ్యక్షుడు ధనంజయ్ బృందం విద్యార్థులకు అర్హత పోటీలు నిర్వహించింది. ఉత్తీర్ణులైనవారికి నైపుణ్యాలపై సంవత్సరం పాటు ఉచిత శిక్షణ ఇచ్చి అనంతరం సాఫ్ట్ వేర్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యేలా చూస్తారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి.రాజశేఖర్, వైస్ ప్రిన్సిపల్ దీనదయాల్, జేకేసీ కోఆర్డినేటర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఉద్యోగి మృతి



ప్రేమ్‌కుమార్(ఫైల్)

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఒప్పంద ఉద్యోగి ప్రేమ్‌కుమార్ గుండెపోటుతో మంగళవారం మరణించాడు. గుండెపోటుతో కిందపడిపోగా ఆలయ సిబ్బంది హుటాహుటినా పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

దేశానికే ఆదర్శంగా జగనన్న పథకాలు

- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు
- వైఎస్సార్ సీపీని ఆదరించండి
- ఎన్నికల ప్రచారంలో బియ్యపు పవిత్రారెడ్డి



శంఖం పూరిస్తున్న పవిత్రారెడ్డి



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: రాష్ట్రంలో అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని వైఎస్సార్ సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మర్రిమందలో ఎన్నికల యుద్ధానికి సిద్ధంగా ఉండాలని శంఖం పూరించి ప్రచారం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగనన్న పాలన సాగిస్తున్నారని తెలిపారు. నవరత్న పథకాల ద్వారా పేదల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి మహిళను లక్షాధికారి చేస్తానని ఎన్నికలలో ఇచ్చిన హామీని సీఎంగా జగనన్న నిలబెట్టుకున్నారన్నారు. 2014లో డ్వాక్రా రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజలను నయవంచన చేశారని ఆరోపించారు. మేనిఫెస్టను పవిత్ర గ్రంథంలా భావించి 98శాతం అమలు చేసి సీఎం జగనన్న చరిత్రలో నిలిచారని తెలిపారు. మరిన్ని పథకాలు, మరింత అభివృద్ధి కావాలంటే 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి సంక్షేమ లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్ గ్లోరీ మేరీ, ఉప సర్పంచ్ మణి, ఎంపీటీసీ సభ్యులు నాగరాజురెడ్డి, మునిరాజా, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా నాయకుడు సుధీర్ కుమార్, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్ యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ మస్తాన్, రామయ్య ఆచారి, గోపీ రాయల్, కృష్ణారెడ్డి, వెంకటేష్ యాదవ్, గెరటయ్య, కేశవులు, లోకనాథరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గుణశేఖర్ నాయుడు, ధనుంజయరెడ్డి, దామోదరంరెడ్డి, గురునాథం, రాంబత్తెయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఏకాదశి ఉత్సవం



ఊరేగింపులో స్వామి,అమ్మవార్లు

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ ప్రముఖ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవర్లు మాడవీధి ఉత్సవంలో భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్య పూజా కైంకర్యాలను నిర్వహించారు. ఏకాదశి గడియల్లో అర్చనలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. ఉత్సవర్లను తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి, మాడవీధుల్లో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి నైవేద్య సమర్పణ చేశారు. ఆర్జితం అధికారి భరత్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో ఆంజనేయస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాయలం లోని పదహారు కాళ్ల మండపం వద్ద ఉన్న శ్రీఆంజనేయస్వామికి మంగళవారం, ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సింధూరంతో శోభాయమానంగా లేపనం చేశారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. తమలపాకుల మాల, వడ మాలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు ఉండాలి



మత్తేరిమిట్ట కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

వరదయ్యపాళెం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో అన్నిరకాల వసతులు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ ఉదయ భారతి తెలిపారు. మండలంలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఉన్న మౌలిక వసతులను తెలుసుకుంటున్నట్లు చెప్పారు. మంగళవారం ఆమె తొండూరు, మత్తేరిమిట్ట, చిలమత్తూరు, కారిపాకం, పులివల్లం, బత్తలవల్లం, వెంకటరెడ్డికండ్రిగ పోలింగ్ కేంద్రాలను ఆమె సందర్శించి అక్కడ మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, వృద్ధులు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు అనుగుణంగా ర్యాంపులు ఉండాలని సూచించారు. అందుకు తగిన విధంగా ఇప్పటి నుంచే సంబంధిత వసతులపై బీఎల్‌ఓలు, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు.

కాంగ్రెస్ టికెట్‌కు బత్తెయ్యనాయుడు దరఖాస్తు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ బత్తెయ్యనాయుడు మంగళవారం దరఖాస్తు చేసుకున్నారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో అధిష్టానం అనుమతి కోరుతూ దరఖాస్తు చేశారు.

పామాయిల్ తోటలతో ఆదాయం



మాట్లాడుతున్న ఏజీఎం మురళి

ఏర్పేడు: పామాయిల్ తోటల పెంపకంతో మంచి ఆదాయం వస్తుందని ఉద్యాన శాఖ ఏజీఎం మురళి అన్నారు. మంగళవారం మండలంలోని ఎండీపుత్తూరు రైతుభరోసా కేంద్రంలో రైతులతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పామాయిల్ తోటల పెంపకం.. దిగుబడి.. రవాణా తదితరాలను వివరించారు. సర్పంచ్ మోహనప్రియ, ఉద్యానశాఖ అధికారిణి పుష్పలత పాల్గొన్నారు.

పంచాయతీకి రూ.33,500 ఆదాయం



వేలం నిర్వహిస్తున్న సర్పంచ్, అధికారులు

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరు పంచాయతీకి చేపల చెరువు వేలం ద్వారా రూ.33,500 ఆదాయం వచ్చింది. మంగళవారం సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో చేపల చెరువుకు వేలం జరిగింది. గ్రామానికి చెందిన మురళీ ఆచారి రూ.33,500 చెరువును దక్కించుకున్నాడు. పంచాయతీ కార్యదర్శి లోకముని, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పరేడ్‌లో తిరుపతి విద్యార్థులకు పసిడి పతకాలు



ప్రధాని మోదీ చేతుల మీదుగా బంగారు పతకం అందుకుంటున్న ఎన్‌సీసీ విద్యార్థి శ్రీశాంత్

తిరుపతి సిటీ: ఢిల్లీలో ఈ నెల 26వ తేదీన జరిగిన గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో పాల్గొన్న తిరుపతి ఎన్‌సీసీ విద్యార్థులు పసిడి పతకాలు సాధించారు. ఇందులో భాగంగా తిరుచానూరులో ఓ ప్రైవేటు స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎన్‌సీసీ విద్యార్థి శ్రీశాంత్ ఢిల్లీలో జరిగిన కవాతులో ప్రతిభ కనబరచినందుకుగాను ప్రధాని మోదీ స్వయంగా విద్యార్థికి బంగారు పతకం అందజేశారు. అలాగే ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న జి లోహిత్ హార్స్ రైడింగ్ హాక్స్ విభాగంలో పసిడి పతకం, హార్స్ జంపింగ్ విభాగంలో రజిత పతకం, హార్స్ డ్రెసేజ్ విభాగంలో మరో రజిత పతకం సాధించారు. అలాగే కళాశాలకు చెందిన ఎస్ చిట్టేష్ రావు వెటరన్ డ్రెసేజ్ పురుషుల విభాగంలో పసిడి పతకం అందుకున్నారు. వీరితో పాటు తిరుపతి ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్‌నకు చెందిన మరో పది మంది విద్యార్థులు సైతం పలు విభాగాల్లో పతకాలు సాధించారని ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు తెలిపారు.

జగనన్నతోనే బీసీల అభివృద్ధి

ఏర్పేడు: సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డితోనే బీసీల అభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.బాలాజీ రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని సదాశివపురంలో ఆయన బీసీలతో సమావేశం నిర్వహించారు. జగనన్న ప్రభుత్వంలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నట్లు వివరించారు. ఈ నెల 11 శ్రీకాళహస్తిలోని శివం కల్యాణ మండపంలో జరిగే బీసీల విజయభేరి సభను విజయవంతం చేయాలని కోరారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

పిచ్చాటూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం అందుతోందని, పేదలకు ఇది వరమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.వెంకట చలపతిరాజు అన్నారు. మంగళవారం మండలంలోని పులికుండ్రం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష -2 వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో చిన్నపిల్లల స్పెషలిస్ట్ డాక్టర్ భార్గవ్, జనరల్ సర్జెన్ డాక్టర్ పూజ, పీహెచ్‌సీ డాక్టర్ మునిచరిత్ర పరీక్షలు చేశారు. 312 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ హమీద్ తెలిపారు. 43 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 23 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. అనంతరం పులికుండ్రం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెంట్ రాధారాణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, శోభన్, బేబి, సర్పంచ్ దిలీప్, మండల మాజీ అధ్యక్షుడు పాలపద్మనాభం, జేసీఎస్ కన్వీనర్ తొప్పయ్య, పార్టీ మండల ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, నాయకులు శేఖర్, సూరిబాబు రెడ్డి, అబ్రహం, ఆర్ముగం రెడ్డి, విశ్వనాథం, చెంగల్రాయ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీరకుప్పంలో..

నాగలాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజి రాజు తెలిపారు. మంగళవారం మండల వైద్యాధికారి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని బీరకుప్పంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ఇంటి ముంగిటే మంచి వైద్యం అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అనంతరం 370 మందికి వైద్య సిబ్బంది పరీక్షలు చేసి మందులు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఎంఎల్ హెచ్ పి.వనజాక్షి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పిచ్చాటూరు: ఆరోగ్యశ్రీ కిట్లను పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



నాగలాపురం: కార్యక్రమంలో మాట్లాడుతున్న అపరంజిరాజు

జగనన్నతోనే పేదల అభ్యున్నతి



పథకాల లబ్ధిని వివరిస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి



దుస్తులు ఐరన్ చేస్తున్న శ్రీవాణిరెడ్డి

శ్రీకాళహస్తి: పేదల అభ్యున్నతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, ఇది ఇలాగే కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మళ్లీ ఆదరించాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి అన్నారు. తొట్టంబేడు మండలం కొణతనేరి పంచాయతీలోని కొణతనేరి, దళితవాడ, గుర్రప్పనాయుడుకండ్రిగ, గాంధీసెంటర్‌లో శ్రీవాణిరెడ్డి సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. జగనన్న పథకాల ద్వారా లబ్ధి పొందిన వివరాలను వివరించారు. ఆమె మాట్లాడుతూ మధుసూదన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి నిత్యం ప్రజా సేవలోనే ఉంటున్నారని తెలిపారు. కరోనా కష్టకాలంలో అండగా ఉంటూ సొంత నిధులతో ఎన్నో సహాయాలు చేశారని పేర్కొన్నారు. రెండు నెలల్లో ఎన్నికలు రానున్న సందర్భంగా నాలుగు సంవత్సరాలుగా కనిపించని ప్రతిపక్ష టీడీపీ నేత నేడు ప్రజలపై కపట ప్రేమను చూపిస్తూ మాయమాటలతో మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. అంతకు ముందు ఆమెకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉన్నం వాసునాయుడు, ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, నాయకులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణయ్యనాయుడు, రామానాయుడు, తిరుపాల్, శ్రీనివాసులు, మణి, గంగయ్య, రామమూర్తి, ముకుంద, సుబ్రహ్మణ్యం, ఏసు, ఆనంద్, వెంకటసుబ్బయ్య, లోకనాథం, మునిరత్నం, గెరటారెడ్డి, శంకరయ్య, రవీందర్‌రెడ్డి, భక్తవత్సలం, మణినాయుడు, రమణయ్యనాయుడు, కోవి చంద్రయ్యనాయుడు, రమేష భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మండపం మార్పుపై కసరత్తు



పరిశీలిస్తున్న దేవస్థానం చైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ భిక్షాల గాలిగోపురం వద్ద ఆర్యవైశ్యుడు చలమయ్యశెట్టి నిర్మించిన గాంధీ బొమ్మ మండప స్థల మార్పుపై మంగళవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారకశ్రీనివాసులు శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు కసరత్తు చేశారు. ప్రస్తుతం ఉన్న గాంధీబొమ్మ ఉన్న స్థలం వద్ద వాహనాల మండపం నిర్మిస్తున్న నేపథ్యంలో గాలిగోపురం ఎడమవైపు చివరి భాగాన ఆలయ నిధులతో నిర్మించేందుకు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ వాహనాల మండప నిర్మాణ పనులు 75 శాతం పూర్తయ్యాయని, గోపురం పక్కన మండపం నిర్మించి అక్కడ గాంధీ బొమ్మను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు అధికారులు, నాయకులు సహకరించాలని కోరారు. ఆలయ అధికారులు శివకిషోర్, డీఈ లలిత తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల స్థలాలకు ఉచిత రిజిస్ట్రేషన్లు



రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న డీపీఓ రాజశేఖర్ రెడ్డి

వరదయ్యపాళెం: జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయిస్తోంది. మండలంలో సంతవేలూరు, కదూరు, బత్తలవల్లం, రాచర్ల, పెద్ద పాండూరు, కోవూరుపాడు జగనన్న కాలనీల్లో ప్రభుత్వం ద్వారా ఇళ్ల స్థలాలు పొంది నిర్మాణం చేసుకుంటున్న 147 మంది లబ్ధిదారుల ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేసి పత్రాలను అందజేశారు. ఉచితంగా రిజిస్ట్రేషన్ పత్రాలు పొందిన లబ్ధిదారులు ఒకింత ఆనందం వ్యక్తం చేస్తూ జీవితాంతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతగా ఉంటామని పేర్కొంటున్నారు. మంగళవారం మండల పర్యటనకు వచ్చిన డీపీఓ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా బత్తలవల్లం సచివాలయంలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. మండలంలో పూర్తిస్థాయిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికావాలని సచివాలయ సిబ్బందికి ఆయన సూచించారు. పంచాయతీ కార్యదర్శి పద్మనాభరాజు పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల

సత్యవేడు: మండలంలోని 28 పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,33,85,455 మంజూరైనట్లు ఈఓపీఆర్డీ మునిరవి కుమార్ తెలిపారు. పంచాయతీల వారీగా.. అలివేలు మంగాపురం పంచాయతీకి రూ.2,31,318, అల్లపుగుంట 2,40,141, ఆంబాకం రూ.3,98,175, ఆరూరు రూ. 2,90,942, చెరివి రూ.4,30,305, చిన్న ఈటిపాకం రూ.2,22,878, దాసుకుప్పం రూ.10,85,326, ఇరుగుళం రూ.5,13,247, జడేరి రూ.1,60,045, కాదిరివేడు రూ.3,80,712, కాళమనాయుడుపేట రూ.3,23,021, కన్నావరం రూ.5,61,499, కొల్లడం రూ.1,85,621, కొత్త మారికుప్పం రూ.3,16,525, మదనంబేడు రూ.8,36,476, మదనంజేరి రూ.2,28,764, మల్లవారిపాళెం ఈస్టు రూ.4,39,274, మల్లవారిపాళెం వెస్టు రూ.1,13,391, నరసరాజు అగ్రహారం రూ.2,37,479, పెద్ద ఈటిపాకం రూ.4,67, 734, పీవిపురం రూ.5,26,470, పుదుకుప్పం రూ.3,75,465, రాజగోపాలపురం రూ.3,93, 841,రేపల్లెవాడ రూ.3,32,106, సత్యవేడు 30,48,861, శిరుణంబూదూరు రూ.3,97,489, వానెల్లూరు రూ.4,50,648, వెంకటరాజుల కండ్రిగ రూ. 1,97,702 మంజూరైనట్లు వివరించారు. ఈ నిధులను తాగునీటి అవసరాలు, మోటార్ల నిర్వహణ, కరెంటుబిల్లు, డ్రైనేజీలు, కల్వర్టు నిర్మాణాలకు వినియోగించాలన్నారు.

కబడ్డీ విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందుకున్న విద్యార్థులు

వరదయ్యపాళెం: కబడ్డీ విజేత జట్లకు మంగళవారం బహుమతులు అందజేశారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, మోండలెజ్ పరిశ్రమ సంయుక్తంగా బత్తలవల్లం హైస్కూల్‌లోని 6,7,8 తరగతులకు విద్యార్థులకు టోర్నమెంట్ నిర్వహించారు. విజేత జట్లకు మంగళవారం పాఠశాలలో బహుమతులను అందజేశారు. హెచ్‌ఎం పరమేశ్వరయ్య, పీఈటీ పవన్‌ల చేతుల మీదుగా మ్యాజిక్ బస్ ప్రాజెక్ట్ మేనేజర్ కొండపల్లి ఆనంద్ అందజేశారు. విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. కో–ఆర్డినేటర్ సుమంత్, కోచ్ సతీష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లైబ్రేరియన్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో లైబ్రేరియన్ పోస్టుకు గెస్టు ప్రతిపాదికన శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం శ్రీలత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. లైబ్రరీ సైన్స్‌లో పోస్టు గ్రా డ్యుయేషన్ (ఎంఎల్ఐఎస్‌సీ) చేసి సెట్/నెట్ అర్హత కలిగిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు శుక్రవారం ఉదయం ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో ఉదయం 10గంటలకు హాజరు కావాలని ప్రిన్సిపల్ తెలిపారు.